క్లుప్తంగా

సీసీరోడ్డు పనులు ప్రారంభం



మానకొండూర్: మండలంలోని కొండపల్కల గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.పది లక్షలతో గురువారం సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు గ్రామస్తులు, నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు మాడ తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ నాగిశెట్టి రాజయ్య, మండల మహిళా అధ్యక్షురాలు దూలం దేవేంద్ర, గ్రామశాఖ అధ్యక్షురాలు మందల రమ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు స్థలం కేటాయించాలి

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్ 647లో ప్రభుత్వ భూమిని ప్రభుత్వ గురుకుల పాఠశాల, వసతి గృహాలకు కేటాయించాలని నవతెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మవెంకటేశ్ కోరారు. పట్టణంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 1980లో జీపీ పాలకవర్గం శ్రీనివాస ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఏర్పాటుకు కాంతారావుకు రెండు ఎకరాల భూమిని 35 ఏళ్ల లీజుకు అగ్రిమెంట్ చేశారు. కాంతారావు మృతితో స్కూల్ మూతపడిపోయింది. గతంలో భూమిని పాలకవర్గం నాయకులు విక్రయించేందుకు చూశారు. కానీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆగిపోయింది. మళ్లీ అలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయని అ క్రమార్కుల చేతుల్లోకి వెళ్లకుండా కలెక్టర్ విచారణ చేసి స్థలాన్ని గురుకుల పాఠశాల, వసతి గృహాలకు కేటాయించాలని కోరుతామన్నారు.

పద్మశాలీ మహాసభ విజయవంతం చేయండి

జమ్మికుంట: హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 9వ తేదీన నిర్వహించే 17వ అఖిల భారత పద్మశాలీ మహాసభ, 8వ తెలంగాణ మహాసభను విజయవంతం చేయాలని కరీంనగర్ పద్మశాలీ జాయింట్ యాక్షన్ కమిటీ కార్యదర్శి గాదె గుణసాగర్ నేత పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో మాట్లాడారు. అఖిల భారత పద్మశాలీ సంఘానికి చట్టసభలో సముచిత స్థానం కల్పించాలని, పద్మశాలీ కార్పొరేషన్ ఏర్పాటుకు రూ.100 కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. పద్మశాలీ కులబాంధవుడు, ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మధ్యప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కలెక్టర్ పరికిపండ్ల నరహరి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని, కులబాంధవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్ష

హుజూరాబాద్: ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్ష పట్టణంలో గురువారం ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాలలో 746 మందికి 720 మంది హాజరయ్యారని పరీక్షల నిర్వహణ అధికారులు ప్రసాద్, కుమారస్వామి, వేణుమాధవ తెలిపారు.

జమ్మికుంట: పట్టణంలోని ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కస్టోడియన్ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో మూడు పరీక్షల కేంద్రాలు ఏర్పాటు చేయగా 558 మందికి 527 మంది విద్యార్థులు హాజరయ్యారని, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సూచించిన సమయంలోనే పరీక్షలు నిర్వహించాలి



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో

హుజూరాబాద్: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు గురువారం ప్రారంభం కాగా ఎంఈవో భూపతి శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. 6 నుంచి 15వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయని, పరీక్షలు ప్రభుత్వం సూచించిన సమయంలోనే నిర్వహించాలని హెచ్ఎంలకు సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

కొత్తపల్లి: విద్యుత్ మీటర్ తిరగకుండా చేస్తామని డబ్బులు వసూలు చేస్తున్న వారి పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ షాదుల్లా బాబా ప్రకటనలో తెలిపారు. కొంతమంది మీటర్ తిరగకుండా చేస్తామని వినియోగదారుల వద్దకు వచ్చి డబ్బులు తీసుకొని మీటర్‌లోని కొన్ని వైర్లను కట్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలా చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి వ్యక్తులు వస్తే తమ దృష్టికి తీసుకరావాలని, లేకుంటే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

పశువులు ఇక సురక్షితం

- వందశాతం సబ్సిడీతో పశువులపాక నిర్మాణం
- పాడిరైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు
- ఆనందం వ్యక్తం చేస్తూ నిర్మాణానికి ముందుకు వస్తున్న అన్నదాతలు



నూతనంగా నిర్మించిన పశువుల పాక నిర్మాణాలు ఇలా..

మానకొండూర్: ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న పశువులపాకలతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణాలు వందశాతం సబ్సిడీతో చేపట్టడం మూలంగా చాలా మంది రైతులు నిర్మించుకునేందుకు ముందుకువస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో పశువుల పాకల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ నిర్మాణాలతో పశువులు సురక్షితంగా ఉంటాయని భావిస్తున్నారు. ఆర్థిక పరిస్థితి అంతంతగా ఉన్న రైతులు పాకలు నిర్మించుకోలేక పశువులను చెట్ల కింద, ఆరుబయట కట్టేస్తుండటంతో ప్రమాదాల బారినపడుతున్నాయి. వేసవిలో వడగండ్లు వంటి ప్రకృతి వైపరీత్యాలు, వర్షాకాలంలో చెట్ల కొమ్మలు విరిగి పడటం, పిడుగుపాటుతో మృతిచెందుతుండగా రైతులకే కన్నీరే మిగులుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని పశువులు సురక్షితంగా ఉండేందుకు ప్రభుత్వం ఉపాధిహామీ కింద పశు పాకలను నిర్మించాలని సూచించడంతో రైతులు నిర్మించుకునేందుకు ముందుకువస్తున్నారు. ఇప్పటికే పశు పాకల నిర్మాణం కోసం పలువురు దరఖాస్తు చేసుకోగా పలువురికి అనుమతి మంజూరైంది. పశువులపాకలు పూర్తయితే నీడతో పాటు ప్రకృతి వైపరీత్యాలతో ప్రమాదం ఉండదని పశువులు సురక్షితంగా ఉంటాయని రైతులు భావిస్తున్నారు.

ఉపాధిహామీ కింద పశువుల పాక నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.80 వేల వరకూ ఖర్చు చేస్తుంది. పొడవు మూడున్నర గజాలు, అడ్డం మూడు గజాల విస్తీర్ణంతో నిర్మించుకోవాలి. నీటి తొట్టి నిర్మాణం, షెడ్డులో మేత మేసేలా ట్రాక్ ఏర్పాటు చేయాలి ఇలా నిర్మాణం చేపడితేనే పూర్తిగా సబ్సిడీ అందుతోంది. రైతులు షెడ్డు విస్తీర్ణం పెంచుకుంటే అదనపు ఖర్చును రైతులే భరించాల్సి ఉంటుంది. మండలానికి 58 మంజూరు కాగా 18 పాకల నిర్మాణం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మరో ఎనిమిది ప్రగతిలో ఉన్నాయని, మిగితా రైతులు మార్చి 31 లోపు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

అనుమతి కోసం...

పశువుల పాక నిర్మించుకునేందుకు తహసీల్దార్ నుంచి సన్న, చిన్నకారు రైతు సర్టిఫికెట్ తీసుకోవాలి, పశువులు ఉన్నట్లు వెటర్నరీ అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రం, అలాగే గ్రామ పంచాయతీ నుంచి తీర్మాణ పత్రం ఉపాధిహామీ అధికారులకు అందజేయాల్సి ఉంటుంది.

సంతోషంగా ఉంది



ప్రభుత్వం రైతులపై ఏమాత్రం భారం పడకుండా వందశాతం సబ్సిడీతో పశువుల పాకలు నిర్మిస్తుండటం చాలా సంతోషంగా ఉంది. రైతు పశువుపాక నిర్మించుకునేందుకు స్థలం ఉంటే సరిపోతుంది. ఎలాంటి ఖర్చు లేకపోవడంతో పశువులున్నా ప్రతి రైతు నిర్మించుకునేందుకు ముందుకువస్తున్నాడు.

– అదప లింగయ్య, లింగాపూర్

మొండి బకాయిలపై దృష్టిసారించాలి



సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్

చొప్పదండి: మున్సిపాలిటీ పరిధిలో మొండి బకాయిల వసూలుపై దృష్టిసారించాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు సూచించారు. పురపాలక సంఘంలో గురువారం అధికారులు, సిబ్బందితో పన్నుల వసూలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. టాప్ 100 డీఫాల్టర్ల నుంచి పన్నులు వసూలు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. నివాస, వాణిజ్య సముదాయాల నుంచి ఆస్తిపన్నులు, లైసెన్స్ ఫీజులు వందశాతం వసూలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రశాంత్‌కుమార్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంఈవో శ్రీనివాస్

చొప్పదండి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ నెట్‌బాల్ అండర్–14 టోర్నమెంట్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరుపున పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. బాలుర విభాగంలో టి. తరుణ్ కుమార్, బి.కృష్ణ, ఎం భీమేశ్ ప్రథమ, బాలికల విభాగంలో పి. మమత ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎంఈవో దీక్షితుల శ్రీనివాస్, హెచ్ఎం వైద్యుల రాజిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కొముర్రోజు కృష్ణ గురువారం మెరిట్ సర్టిఫికెట్లు అందించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు పలువురు అభినందించారు.

కొత్తపల్లిలో ఏర్పాటు చేశాకే కరీంనగర్‌లో మూసేయాలి



కార్యాలయం ప్రారంభిస్తున్న మధుసూదన్‌రావు

కరీంనగర్: కొత్తపల్లిలో పూర్తిస్థాయి రైల్వే గూడ్స్ షెడ్‌ను ఏర్పాటు చేశాకనే కరీంనగర్‌లో మూసి వేయాలని కరీంనగర్ జిల్లా రైల్వే హ్యాండిలింగ్ అండ్ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది లక్ష్మీనారాయణ, కార్యదర్శి సమద్ నవాబ్‌లు అన్నారు. గురువారం నగరంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎదురుగా ఏర్పాటు చేసిన కరీంనగర్ జిల్లా రైల్వే హ్యాండిలింగ్ అండ్ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని లీగల్ అడ్వయిజర్, ప్రముఖ న్యాయవాది మధుసూదన్‌రావు ప్రారంభించారు. లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీల, లారీ యజమానుల సమస్యల పరిష్కారానికి కార్యాలయం వేదికగా ఉపయోగపడనుందని తెలిపారు. రారైస్, బాయిల్డ్ రైస్, మక్కలు, ఎరువుల రవాణాకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు నర్సింగరావు, కోశాధికారి పోకల రవి, ఉపాధ్యక్షులు కరుణాకర్, రవీందర్, శ్రీనివాస్, షర్ఫుద్దీన్, సహాయ కార్యదర్శి సురేశ్, మొయిజుద్దీన్, సాంబయ్య, గుండేటి వేణు, సభ్యులు శంకరయ్య గిరిధర్లాల్ జోడి, రాజేశ్వర్‌రెడ్డి, రవి, మహేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు కొత్త వంటపాత్రలు

- రూ.2.90లక్షలతో కొనుగోలు



వంటపాత్రలు పంపిణీ చేస్తున్న ఎంఈవో రవీందర్

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని నిర్వాహకులు మరింత రుచిగా అందించడానికి కొత్త వంటపాత్రలు పంపిణీ చేశారు. సుమారు రెండు దశాబ్దాల క్రితం పంపిణీ చేసిన పాత్రలతోనే ఇన్నాళ్లు నిర్వాహకులు నెట్టుకొచ్చారు. మసి పట్టిన, వేడికి సున్నితంగా మారిన పాత్రల్లో వంట చేయడంతో ఆహార పదార్థాల రుచి మారిపోవడంతో విద్యార్థులు తినేందుకు ముందుకు రావడంలేదు. గతేడాది డిసెంబర్ 23న కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆటవస్తువులు పంపిణీ చేసేందుకు వచ్చిన కలెక్టర్ పమేలా సత్పతి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పాత వంటపాత్రలతో వంట చేసేందుకు ఇబ్బందిపడుతున్నామని నిర్వాహకులు చెప్పడంతో వెంటనే కొత్త పాత్రల కోసం టెండర్ నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈక్రమంలో వారం రోజుల క్రితం కరీంనగర్ మండలంలోని 22 ప్రభుత్వ పాఠశాలలకు కొత్త వంటపాత్రలు కేటాయించారు. మొత్తం రూ.2.90 లక్షలతో విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా కొత్త పాత్రలు కొనుగోలు చేసి సరఫరా చేశారు. ఈ మేరకు ఆయా పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఇటీవల నగునూరు జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో కె.రవీందర్ వంట పాత్రలు పంపిణీ చేశారు. కొత్త పాత్రలు పంపిణీ చేయడంపై నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

20, 21వ తేదీల్లో కిట్స్‌ోజెన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల సెక్రటరీ, డైరెక్టర్, అధ్యాపకులు

హుజూరాబాద్: మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కిట్స్‌ోజెన్-2025 వాల్‌పోస్టర్‌ను గురువారం కళాశాల సెక్రెటరీ, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 20, 21వ తేదీల్లో క్రీడా, సాహిత్య, సాంస్కృతిక ఉత్సవాలు జరగనున్నాయని, రెండేళ్లకోసారి కిట్స్‌ోజెన్ నిర్వహిస్తున్నామని, విద్యార్థులు ప్రతిభ పాటవాలను ప్రదర్శిస్తారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల రిజిస్టర్ డాక్టర్ వి.రాజేశ్వరరావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు తదితరులున్నారు.

ముగిసిన గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



విరాళం అందజేస్తున్న వొడితెల ప్రణవ్‌బాబు

వీణవంక: మండలంలోని బేతిగల్‌లో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న భూలక్ష్మి, మహాలక్ష్మి బొడ్రాయి, పోచమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. అర్చకులు నరసింహాచార్యుల ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ఠాపన చేయగా మహిళలు మంగళహారతులతో యాగశాలలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబు ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరుకాగా గ్రామస్తులు శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామానికి రూ.రెండు లక్షలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పలువురు నాయకులు పాల్గొన్నారు.

కాపర్ వైరు నిందితుల అరెస్టు

చొప్పదండి: జల్సాల కోసం చోరీలకు పాల్పడుతున్న నిందితులను చొప్పదండి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై గొల్లపల్లి అనూష తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీరామ ఇంజినీరింగ్ షాపు యజమాని వెంకట్ రెడ్డికి చెందిన గోదాములో ఈనెల 4న గుర్తు తెలియని వ్యక్తులు క్వింటాల్ రాగి వైరును ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. గురువారం వాహనాల తనిఖీ చేపట్టగా బస్టాండ్ వద్ద ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. పారిపోయే క్రమంలో వారిని పట్టుకున్నారు. చొప్పదండికి చెందిన గోగులకొండ మహేశ్, కడారి అభిషేక్ సంచిలో రాగి వైరును తరలిస్తున్నట్లు గుర్తించారు. వీరితో పాటు మరో స్నేహితుడు రాంటెక్ శివ ప్రసాద్ పాల్గొన్నట్లు విచారణలో తేలింది. కాపర్ వైరును చొప్పదండికి చెందిన గుండేటి హరీశ్ సాయంతో చింతల ప్రసాద్ అనే వ్యక్తికి విక్రయించినట్లు తెలిపారు. కాపర్‌వైరుకు రూ. 35 వేలు రాగా, మహేశ్ రూ. 20 వేలు తీసుకొని సెల్‌ఫోన్ కొన్నాడు. మిగతా రూ.15వేలను అభిషేక్, శివ, హరీశ్ తీసుకున్నారు. వారి వద్ద 50 కిలోల వైరును స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు నిందితులు చోరీకి పాల్పడ్డారని ఎస్సై తెలిపారు. గోగులకొండ మహేశ్, శివ ప్రసాద్ ఇప్పటికే దొంగతనం కేసులో జైలుకెళ్లినట్లు పేర్కొన్నారు. కడారి అభిషేక్ గంజాయి విక్రయిస్తూ పోలీసులకు గతంలో దొరకగా జైలుకెళ్లి వచ్చాడన్నారు. ముగ్గురు గోదాములో చోరీకి పాల్పడినట్లు తెలిపారు.



శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామంలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీతో నీరంతా రోడ్డు పైనుంచి వృథాగాపోతోంది. సంబంధిత అధికారులు స్పందించాలని, లీకేజీకి మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నర్సయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి, సెల్ నంబర్: 94401 49679

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం సీపీఐ కార్యాలయంలో గురువారం భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభ కరపత్రాలను సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య ఆవిష్కరించారు. 16న కరీంనగర్‌లో నిర్వహించే మూడవ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. మహాసభకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో లక్ష్మణ్, ఖాజాపాషా, కన్నం సదానందం, శ్రీహరి, రాజయ్య పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న కొప్పుల శంకర్, నాయకులు

హుజూరాబాద్: పంచాయతీల కార్మికుల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సీఐటీయూ హమాలీ సంఘం భవనంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం కొత్తూరు మల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించకుంటే దశలవారీగా ఆందోళనలకు సన్నద్ధమవుతామని, ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఒకటి నుంచి పదో తేదీలోపు కార్మికులకు జీతాలు చెల్లించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో రెండు నుంచి ఐదునెలల వరకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం చెల్లించాలన్నారు. సమావేశంలో నాయకులు ఎండీగా రవీందర్‌రావు, ఎలుకపల్లి సారయ్య, మహంకాళి కొమురయ్య, కాశిపాక శంకర్, వడ్లూరి లక్ష్మీనారాయణ, మొలుగూరి ప్రేమ్‌కుమార్, గంధసిరి సంపత్, సమ్మయ్య, చంద్రయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



జమ్మికుంటలో నాయకుల సంబరాలు



చిగురుమామిడిలో..

బీజేపీ నాయకుల సంబరాలు

చొప్పదండి: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించగా మండలంలోని బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్, పట్టణ అధ్యక్షుడు శ్రావణ్ ఆధ్వర్యంలో నాయకులు పటాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

హుజూరాబాద్: టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని బీజేవైఎం రాష్ట్ర నేత సింగిరాల రామరాజు అన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకతను గెలుపే తెలియజేస్తుందన్నారు.


జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కరీంనగర్ మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు మాట్లాడుతూ.. ఏడాదిలో ఉద్యోగాలు భర్తీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, రానున్న రోజుల్లో స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమన్నారు.

గన్నేరువరం: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా బీజేపీ అభ్యర్థులు గెలుపొందడం మార్పుకు సంకేతమని పార్టీ మండల అధ్యక్షుడు నికేష్ అన్నారు. మండల కేంద్రంలో పేల్చి సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత నెలకొందని, ఇదే స్ఫూర్తితో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలకు కైవసం చేసుకుంటుందనే ధీమా వ్యక్తం చేశారు.


శంకరపట్నం: పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి విజయం సాధించడంతో కేశవపట్నంలో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. అంబేద్కర్ విగ్రహం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ తీశారు.

రామడుగు: పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి విజయం సాధించగా మండల కేంద్రంలో బీజేపీ రామడుగు అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.

చిగురుమామిడి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చిన్నమైల్ అంజిరెడ్డి ఘనవిజయం సాధించడంతో మండల కేంద్రంలో కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. చిగురుమామిడి మినీ బస్టాండ్ ఎదుట టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఓటువేసిన చిగురుమామిడి మండల పట్టభద్రులకు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.



శంకరపట్నం: కేశవపట్నంలో ర్యాలీ



గన్నేరువరంలో..



రామడుగులో...